

రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు
» 52మందికి పోస్టింగ్స్ -7లో

నెలలు నిండని చంటిబిడ్డకు పునర్జన్మ
» జీజీహెచ్‌లో పరామర్శించిన హెన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ -8లో



మన్యం అందాలకు సుప్రీంకోర్టు జడ్జి ఫిదా

అల్లూరి జిల్లా అరకులోయ, అనంతగిరి మండలాల్లో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జేకే మహేశ్వరి కుటుంబ సమేతంగా పర్యటించారు. శనివారం ఉదయం విశాఖపట్నం నుంచి అద్దాల రైలులో అరకులోయకు చేరుకొన్న జస్టిస్ జేకే మహేశ్వరికి జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్వాగతం పలికారు. అనంతరం గిరిజన మ్యూజియం, గ్రామదర్శిని బొర్రా గుహలను సందర్శించారు. మన్యం అందాలను తిలకించి జస్టిస్ మహేశ్వరి అబ్బురపడ్డారు.

- అరకులోయ



అరకులోయలో గిరిజన మ్యూజియంను తిలకిస్తున్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ మహేశ్వరి



చెరువులవేనంలో మంచు మేఘాలను తిలకిస్తున్న పర్యాటకులు

చెరువులవేనంలో స్నోయగం

ఆంధ్రకశ్మీర్ లంబసింగికి సమీపంలో ఉన్న చెరువులవేనం ప్రకృతి అందాలకు పర్యాటకులు ఫిదా అవుతున్నారు. శనివారం వీకెండ్ కావడంతో లంబసింగి అందాలను ఆస్వాదించేందుకు భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ప్రకృతి ప్రేమికుల మనస్సు దోచే విధంగా అత్యద్భుతమైన మంచు సోయగాలు ఆవిష్కృతమయ్యాయి. పచ్చని అడవులను తాకుతూ నింగీ నేలను ఏకం చేస్తూ పయనిస్తున్న శ్వేత వర్ణం మంచు అందాలు సందర్శకులను కనువిందు చేశాయి. దీంతో పర్యాటకులు మంచు అందాలను కెమెరాలో బంధించేందుకు పోటీ పడ్డారు. -**చింతపల్లి**

ఐటీడీఏ పీవో అభిషేక్‌కు బదిలీ

చిత్తూరు జేసీగా నియామకం

- తెనాలి సబ్‌కలెక్టర్ ప్రభాకర్ జైన్‌కు పాడేరు సబ్‌కలెక్టర్‌గా పోస్టింగ్
- ఆయనకే ఐటీడీఏ పీవోగా అదనపు బాధ్యతలు

పాడేరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌కు బదిలీ అయింది. ఆయన్ని చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. అలాగే తెనాలిలో సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ప్రభాకర్ జైన్‌ను స్థానిక సబ్‌కలెక్టర్‌గా నియమించి, ఐటీడీఏ పీవోగా అదనపు బాధ్యతలు అప్పగించింది. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వి.అభిషేక్ శిక్షణ పూర్తి చేసుకుని 2021లో స్థానిక సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు. సుమారు ఏడాదిన్నర తర్వాత ఆయన్నే స్థానిక ఐటీడీఏ పీవోగా నియమించారు. దీంతో సుమారు మూడేళ్లు ఇక్కడే సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీవోగా అభిషేక్ పనిచేశారు. ఇదిలావుండగా ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన పి.ధాత్రిరెడ్డిని గత నెలలో ఏలూరు జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. దీంతో ప్రస్తుతం స్థానిక జేసీ ఎంజే.అభిషేక్‌గౌడ్ ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. తెనాలి సబ్‌కలెక్టర్ ప్రభాకర్ జైన్‌ను స్థానిక సబ్‌కలెక్టర్‌గా నియమిస్తూ, ఆయనకే ఐటీడీఏ పీవో ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.



వి.అభిషేక్, జేసీ (చిత్తూరు)



ప్రభాకర్ జైన్, సబ్ కలెక్టర్

గంజాయిపై ఉక్కుపాదం

సాగు, రవాణా నియంత్రణపై దృష్టిపెట్టండి

- ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలకు డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశం
- పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి 27 ప్రత్యేక బృందాలు
- ఏజెన్సీతో అనుసంధానమైన రహదారుల్లో గల చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా
- తరచూ పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్ట్
- గంజాయి సాగుదారులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలి



ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టీ

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, రవాణా నియంత్రణపై గట్టిగా దృష్టిసారించాలని ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశించారు. గంజాయి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వంద రోజుల కార్యాచరణపై ఎస్పీలతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. కైలాసగిరిలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో సమావేశమై గంజాయి నియంత్రణ, కేసుల దర్యాప్తు, నిందితులపై చర్యలకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉంటూ పరారీలో ఉన్న వారిని పట్టుకోవడానికి 27 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. నేరస్తులను పట్టుకునేందుకు నిర్దిష్ట కాలపరిమితిని డీఐజీ నిర్దేశించారు. గంజాయిని ఇతర రాష్ట్రాలకు రవాణా చేసేందుకు వినియోగించే మార్గాలను గుర్తించాలని ఎస్పీలను ఆదేశించారు. ఏజెన్సీతో అనుసంధానమైన మైదాన ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటుచేయడంతోపాటు తగినంత సిబ్బందిని నియమించి, డైనమిక్ వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు.

తరచూ గంజాయి రవాణాకు పాల్పడుతున్న 59 మందిపై పీడీ యాక్ట్‌కు ప్రతిపాదనలు చేశామని, దీనికి ప్రభుత్వం నుంచి ఆమోదం రావాల్సి ఉందని డీజీఐ వివరించారు. కంటైనర్లలో గంజాయి రవాణా గుర్తించేందుకు వీలుగా నర్సీపట్నం, అనకాపల్లిలో స్నిపర్‌డాగ్ స్క్వాడ్‌ను అందుబాటులోకి తెచ్చామని అనకాపల్లి ఎస్పీ దీపికాపాటిల్ వివరించారు. 2024లో ఇంతవరకూ విశాఖ పరిధిలోనే 223 గంజాయి కేసులు నమోదుచేసి రూ.4.75 కోట్ల విలువైన 9,517 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డీఐజీ వివరించారు. ఈ కేసుల్లో 545 మందిని అరెస్టు చేయగా...వారిలో 249 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారన్నారు. నిందితుల నుంచి 155 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి సాగవుతున్న ప్రాంతాలు ఒడిశా సరిహద్దు జిల్లాల్లో అత్యధికంగా ఉన్నట్టు శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించామన్నారు. గంజాయి సాగు చేస్తున్న ప్రాంతాలకు ఎస్పీలు, ఇతర అధికారులు వెళ్లి ప్రత్యామ్నాయ పంటలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఐజీ ఆదేశించారు.

దీనికోసం ప్రభుత్వ శాఖల అంతర్గత కమిటీ ఏర్పాటుచేసి తరచూ గ్రామాల్లో అవగాహన సమావేశాలు, కళాజాతలు నిర్వహించాలని సూచించారు. గంజాయి నిషేధం, వినియోగం వల్ల జరుగుతున్న అనర్థాలపై గిరిజనులకు అర్థమయ్యేలా ముఖ్యమైన జంక్షన్లు, ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటుచేయాలని కోరారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపికాపాటిల్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్, విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి, శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏడీపీఎస్ స్పెషల్ ప్రాసిక్యూటర్ వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయికి ప్రత్యామ్నాయం జాఫ్రా

సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ

- పోడు, మెట్ట భూములు అనుకూలం
- గింజలకు అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ డిమాండ్
- ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఉచితంగా మొక్కలు పంపిణీ



జాఫ్రా మొక్క

చింతపల్లి, ఆగస్టు 17: **గంజాయికి ప్రత్యామ్నాయ పంటగా జాఫ్రా (అనోటా) సాగు లాభదాయకమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ గింజలకు అంతర్జాతీయ మార్కెట్‌లో గరిష్ఠ ధర లభిస్తున్నది. ఈ ఏడాది కిలో జాఫ్రా గింజలకు రూ.170 గరిష్ఠ ధర లభించింది. దీంతో కూటమి ప్రభుత్వం ఆదివాసీ రైతులను జాఫ్రా సాగును ప్రోత్సహించేందుకు కార్యాచరణ ప్రారంభించింది. రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జాఫ్రా మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నది.**

దక్షిణ భారతదేశంలో జాఫ్రా సాగుకు పాడేరు ఏజెన్సీ అత్యంత అనుకూలమని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు 20ఏళ్ల క్రితమే నిర్ధారించారు. మెట్టు, పోడు భూముల్లో వర్షాధారంపై గంజాయికి ప్రత్యామ్నాయంగా జాఫ్రా సాగు అత్యంత అనుకూలమని శాస్త్రవేత్తలు సిఫారసు చేస్తున్నారు. ఇప్పటికే గిరిజనులు పొలాల గట్లపై జాఫ్రాను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ఇక్కడ సాగు చేసే జాఫ్రాకు 'ఏ' గ్రేడ్ లభిస్తోందని శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడయ్యింది.

స్వల్ప వ్యయం..అధిక ఆదాయం

జాఫ్రా మొక్కలు నాటిన మూడో ఏట నుంచి కాపుకొస్తాయి. మొదటి ఏడాది మొక్కలు, గోతులు తీయడం, ఎరువులు, పొలం చుట్టూ కంచె వేయడానికి ఎకరానికి రూ.12వేల వరకూ ఖర్చు అవుతోంది. రెండు, మూడు సంవత్సరాల్లో ఎరువుల కోసం రూ. మూడు నుంచి నాలుగు వేలు ఖర్చు అవుతోంది. నాలుగు, ఐదు సంవత్సరాల్లో కాపు కొద్దిగానే వుంటోంది. ఆరో ఏట నుంచి దిగుబడి బాగా పెరుగుతోంది. గరిష్ఠంగా 18 ఏళ్లకుపైగా పంట దిగుబడి వస్తోంది. ఎకరాకు 500 మొక్కలు నాటుకోవాలి.

ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొక్కలు పంపిణీ..

జాఫ్రా సాగును ప్రోత్సహించేందుకు ... మిగతా 8వ పేజీలో

విద్యాలయాల్లో ఎన్నికల సందడి

సజావుగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

- మొత్తం పాఠశాలలు 2,914, ఎస్ఎంసీ ఎన్నికలు జరిగినవి 2,536
- వివిధ కారణాలతో 30 పాఠశాలల్లో వాయిదా
- అనేక మండలాల నుంచి జిల్లా కేంద్రానికి చేరని సమాచారం



హుకుంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలను పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజిరావు

(పాడేరు-ఆంధ్రజ్యోతి) జిల్లాలోని విద్యాలయాల్లో శనివారం ఎన్నికల సందడి నెలకొంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఈనెల 8న జరగాల్సిన 'స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ' ఎన్నికలను ఈనెల 17న నిర్వహించాలని ఎన్నికల కమిషన్ సూచించింది. దీంతో జిల్లాలోని 22 మండలాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో 'స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ' ఎన్నికలు శనివారం సజావుగా జరిగాయి. జిల్లా మొత్తం గిరిజన ప్రాంతం కావడంతో ఎస్ఎంసీ ఎన్నికలపై విద్యార్థులు తల్లిదండ్రులు పెద్దగా ఆసక్తి చూపని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ ఎన్నికలపై పోటీల ప్రభావం అంతగా లేదు. దీంతో అనేక ప్రాంతాల్లోనూ ఏకగ్రీవంగానే 'స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ' ఎన్నికలు జరిగాయి.

జిల్లా వ్యాప్తంగా 2,914 పాఠశాలలు

జిల్లాలోని 22 మండలాల్లో ప్రాథమిక పాఠశాలలు 2,505, ప్రాథమికోన్నత పాఠశాలలు 140, ఉన్నత పాఠశాలలు 250, కస్తూర్బా బాలికల విద్యాలయాలు 19 కలిపి మొత్తం 2,914 పాఠశాలలున్నాయి. శనివారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి జిల్లాలోని 2,566 పాఠశాలలకు సంబంధించిన సమాచారం మాత్రమే జిల్లా విద్యాశాఖాధికారులకు అందింది. ఇంకా 348 పాఠశాలలకు సంబంధించిన సమాచారం జిల్లా కేంద్రానికి చేరలేదు. రాత్రి తొమ్మిది గంటలకు అందిన సమాచారం మేరకు జిల్లాలో 2,536 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరగ్గా, మరో 30 పాఠశాలల్లో వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. అలాగే ఎన్నికలు జరిగిన 2,536 పాఠశాలలకు 1,476 స్కూళ్లలో ఓటింగ్ కాగా, 1,060 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. వాటిలో విశాఖ మన్యంలోని స్కూళ్లే వెయ్యి వరకు ఉండడం విశేషం. అయితే రంపచోడవరం డివిజన్ పరిధి నుంచి సంపూర్ణమైన సమాచారం అందకపోవడంతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సిబ్బంది ఇబ్బంది పడ్డారు.



పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో వైద్యులు, సిబ్బంది మానవహారం

వైద్యుల నిరసన

కోల్‌కతా ఘటనపై ఆందోళన

ఆస్పత్రుల్లో నిలిచిన సేవలు

- ఇన్‌పేషెంట్, అత్యవసర సేవలకు మినహాయింపు
- వైద్యుల రక్షణకు పటిష్ట చట్టాలు రూపొందించాలని డిమాండ్



పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

(పాడేరు-ఆంధ్రజ్యోతి) కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనపై ఏజెన్సీలో శనివారం నిరసన పెల్లుబికింది. జిల్లా వ్యాప్తంగా ఈ ఘటనపై నిరసన ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. అలాగే ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్ సేవలను బహిష్కరించి, కేవలం ఇన్‌పేషెంట్, అత్యవసర సేవలకు మాత్రమే పరిమితమయ్యారు. జిల్లా వ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది నిరసనలతో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన మరోమారు ప్రజల్లో చర్చకు వచ్చింది. జిల్లా కేంద్రం పాడేరులో వైద్యులు సిబ్బంది ఓపీ సేవలను బహిష్కరించి, పట్టణంలోని నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం ముందు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం వైద్యులు, సిబ్బంది మానవహారం నిర్వహించారు. అలాగే అరకులోయ ఏరియా ఆస్పత్రి, చింతపల్లి, ముంచంగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోనూ, పీహెచ్‌సీల్లోనూ శనివారం అవుట్ పేషెంట్ సేవలను బహిష్కరించి, నిరసన ర్యాలీలు చేపట్టారు. హత్యాచార ఘటనపై న్యాయం జరగాలని, ఇటువంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా పాలకులు కఠిన చట్టాలు రూపొందించి, వైద్యులకు రక్షణ కల్పించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు.. నిందితుల్ని శిక్షించే వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. వైద్యారోగ్య ఉద్యోగుల సంఘాలు, విద్యార్థి, ప్రజా సంఘాల ప్రతినిధులు సైతం ఈ నిరసనకు మద్దతుగా నిలిచారు.

జామిగూడ ఘాట్‌లో జీపు బోల్తా

పది మందికి గాయాలు

- రూడకోట పీహెచ్‌సీలో చికిత్స
- ఆరుగురికి ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలింపు



చాకిరేవు సమీపంలో బోల్తాపడిన ప్రైవేటు జీపు



తలకు గాయాలై రూడకోట పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న నందిని

పెదబయలు, ఆగస్టు 17: మండలంలోని జామిగూడ పంచాయతీ చాకిరేవు జంక్షన్ వద్ద శనివారం ప్రైవేటు జీపు బోల్తా పడిన ఘటనలో పది మంది గాయపడ్డారు. ముంచంగిపుట్టు వారపు సంత నుంచి తిరిగి వస్తుండగా జీపు బ్రేకులు ఫెయిల్ కావడంతో రోడ్డుపై పల్టీ కొట్టింది. దీంతో స్థానికులు రూడకోట ఆస్పత్రికి సమాచారం అందించారు. అక్కడి నుంచి అంబులెన్స్ వచ్చిన వెంటనే క్షతగాత్రులను పీహెచ్‌సీకి తరలించారు. వీరిలో ఆరుగురికి తల, చేతులు, ముఖం భాగాలపై బలమైన గాయాలు కావడంతో రూడకోట పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. జీపులో 15 మంది ప్రయాణికులుండగా.. పది మందికి గాయాలయ్యాయి. నలుగురికి స్వల్పగాయాలు కాగా.. మిగతా వారు క్షేమంగా బయటపడ్డారు.

క్రైం... crime news

విహారయాత్రలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- మృతుడు రంగారెడ్డి జిల్లా యువకుడు
- పాడేరు సందర్శనకు హైదరాబాద్ నుంచి బృందం రాక


ప్రమాదంలో మృతిచెందిన శరత్‌కుమార్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 17: విహారయాత్రలో విషాదం చోటుచేసుకుంది. ఏజెన్సీ ప్రాంత సందర్శనకు హైదరాబాద్ నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఒకరు శుక్రవారం రాత్రి అనకాపల్లి బైపాస్ జంక్షన్‌కు సమీపంలో ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో మృతిచెందారు. మరో యువతి తీవ్రంగా గాయపడింది. ఇందుకు సంబంధించి శనివారం ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు అందించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న ఏడుగురు శుక్రవారం విశాఖ చేరుకున్నారు. వారిలో ఐదుగురు రెండు ద్విచక్ర వాహనాలను అద్దెకు తీసుకుని ఒక బండిపై ఇద్దరు, మరో బండిపై ముగ్గురు అల్లూరి జిల్లా పాడేరు సమీపాన గల వంజంగి పర్యాటక ప్రాంతాన్ని తిలకించేందుకని బయలుదేరారు. పాడేరు వెళ్లేందుకు దారి తెలియక జాతీయ రహదారిపై అనకాపల్లి బైపాస్ జంక్షన్ వరకూ వచ్చేశారు. దారి తప్పామని అక్కడ గుర్తించారు. ఐదుగురిలో తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చంద్రానగర్‌కు చెందిన పురాల శెట్టి శరత్‌కుమార్ (24), ములుగు జిల్లాకు చెందిన యువతి ఒక వాహనంపై ఉన్నారు. వీరు పాడేరుకు ఎలా వెళ్లాలో స్థానికుల ద్వారా తెలుసుకుని..తమకంటే ముందు వెళుతున్న ముగ్గురికి సమాచారం అందించారు. అక్కడున్న వంతెన పైనుంచి సర్వీస్ రోడ్డులోకి రావాల్సిందిగా చెప్పి...అక్కడ వేచి ఉన్నారు. ముగ్గురు స్నేహితులు వంతెన పైనుంచి సర్వీస్ రోడ్డులోకి వచ్చేందుకు వాహనాన్ని మలుపు తిప్పుతుండగా అదే సమయంలో విశాఖ నుంచి హైదరాబాద్ వెళుతున్న ఇంటర్‌సిటీ బస్సు వచ్చింది. ఆ ముగ్గురినీ తప్పించబోయి సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న శరత్‌కుమార్‌ను, పక్కనున్న యువతిని ఢీకొంది. దీంతో శరత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. యువతి తీవ్రంగా గాయపడడంతో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స చేసి అనంతరం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్నేహితుల్లో ఒకరైన ఎండపల్లి ప్రమోద్‌శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ పైడపునాయుడు తెలిపారు. విశాఖలో చికిత్స పొందుతున్న యువతి ప్రాణాపాయం నుంచి బయటపడినట్టు తమకు సమాచారం అందిందని ఆయన తెలిపారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య


సంతోష్‌కుమార్ (ఫైల్)

పరవాడ, ఆగస్టు 17: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందన్న మనస్తాపంతో భర్త ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గొర్లివానిపాలెం పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో వై.సంతోష్‌కుమార్ (39) భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నారు. ఇతను ఫార్మాసిటీలోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 14వ తేదీ రాత్రి సంతోష్‌కుమార్ భార్య వాణితో గొడవ పడ్డాడు. దీంతో ఆమె పిల్లలను తీసుకుని అమ్మవారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన సంతోష్‌కుమార్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇదిలావుండగా సంతోష్‌కుమార్ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పరవాడ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ సురేష్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని వివరాలను సేకరించారు. సంతోష్‌కుమార్ మృతి చెంది మూడు రోజులు గడిచి ఉండొచ్చనని పోలీసులు భావిస్తున్నారు. శరీరం పూర్తిగా ఉబ్బిపోయింది. మృతుడు సంతోష్‌కుమార్‌కు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. భార్య వాణితోపాటు అనీషా (9), మనీషా (4) కుమార్తెలు ఉన్నారు. గతంలో వీరు అనకాపల్లి మండలం మారేడుపూడిలో నివాసం ఉండేవారు. వారం క్రితమే జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి వచ్చారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని తల్లి వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని పాదచారి మృతి

కొత్తూరు, ఆగస్టు 17: అనకాపల్లి మండలం బవులవాడ గ్రామ సమీపంలో శనివారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని పాదచారి మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. బవులవాడ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉందని అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. ఎటువంటి ఆధారాలు దొరకలేదన్నారు. దీంతో ఆ వ్యక్తి మృతదేహాన్ని ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తేజేశ్వరరావు చెప్పారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి ఒకరి మృతి


పోలిన భాస్కరరావు (ఫైల్)

కొత్తూరు, ఆగస్టు 17: మండలంలోని కుంచంగి గ్రామానికి చెందిన పోలిన భాస్కరరావు(34) ద్విచక్రవాహనంపై నుంచి జారి పడి మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. శనివారం పోలిన భాస్కరరావు ఇంటి వద్ద నుంచి తుమ్మపాల గ్రామానికి పనిపై వచ్చి తిరిగి వెంకుపాలెం మీదుగా కుంచంగి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా మార్గమధ్యలో గాటీల గొయ్యి వద్ద పడిపోయాడు. ఈ ప్రమాదంలో భాస్కరరావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అనకాపల్లిలోని ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడని ఆయన తెలిపారు. భాస్కరరావు భార్య భవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. కాగా ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.14 లక్షలు చోరీ

మునగపాక (తుమ్మపాల), ఆగస్టు 17 : మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో గల ఎస్‌బీఐ ఏటీఎంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. దుండగులు ఏటీఎంలో చొరబడి గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను కట్ చేసి నగదు చోరీకి పాల్పడ్డారన్నారు. సుమారు రూ.14లక్షలు చోరీకి గురైనట్టు గుర్తించామన్నారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరిస్తుందని, చోరీకి పాల్పడిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ సత్యనారాయణ, సీఐ గఫూర్ పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు.

రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

- 52 మందికి పోస్టింగ్స్

విశాఖపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎత్తివేసిన నేపథ్యంలో శనివారం రాత్రి విశాఖ రేంజ్ పరిధిలో భారీగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి.

ఇప్పటికే పలుచోట్ల పనిచేస్తున్న అధికారులు, పోస్టింగ్స్ కోసం ఎదురుచూస్తున్న మొత్తం 52 మందిని బదిలీ చేస్తూ రేంజ్ డీఐడీ గోపీనాథ్ జెట్టీ ఉత్తర్వులు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేంజ్‌లో ఇంత ఎక్కువ మందిని బదిలీలు చేయడం ఇదే తొలిసారి.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్	బదిలీ అయిన సర్కిల్
టీవీ విజయకుమార్	సోషల్‌మీడియా సెల్	అనకాపల్లి టౌన్ విజయనగరం
చిల్లా నరసింగరావు	విశాఖ రేంజ్	రాంబిల్లి
ఎస్.లక్ష్మణరావు	రాంబిల్లి	విశాఖ రేంజ్
ఎ.విజయకుమార్	నక్కపల్లి యూపీఎస్	టెక్కలి యూపీఎస్
పి.పైడయ్య	టెక్కలి యూపీఎస్	విశాఖ రేంజ్
కె.కుమారస్వామి	అనకాపల్లి సోషల్ మీడియాసెల్	నక్కపల్లి యూపీఎస్
జి.కోటేశ్వరరావు	విశాఖ రేంజ్	కొత్తకోట
ఎల్.అప్పలనాయుడు	కొత్తకోట సర్కిల్	విశాఖ రేంజ్
ఎస్.ధనుంజయరావు	అనకాపల్లి రూరల్	ఎలమంచిలి
ఎస్‌కే గఫూర్	ఎలమంచిలి	విశాఖ రేంజ్
కె.సతీశ్‌కుమార్	రుషికొండ మెరైన్	బొబ్బిలి టౌన్
ఎం.నాగేశ్వరరావు	బొబ్బిలి టౌన్	విశాఖ రేంజ్
ఎల్.హిమగిరి	డీఎస్‌బీ, ఏఎస్ఆర్ జిల్లా	అరకు
సీహెచ్ రుద్రశేఖర్	అరకు	విశాఖ రేంజ్
బి.అప్పలనాయుడు	విశాఖ రేంజ్	డీఎస్‌బీఏఎస్ఆర్ జిల్లా
జి.అశోక్‌కుమార్	డీటీసీ, ఏఎస్ఆర్ జిల్లా	విజయనగరం రూరల్
ముదిలి శ్రీనివాసరావు	విజయనగరం రూరల్	జీకే వీధి
వి.నారాయణరావు	డీసీఆర్‌బీ, ఏఎస్ఆర్ జిల్లా	పార్వతీపురం టౌన్
హెచ్ మల్లేశ్వరరావు	విశాఖ రేంజ్ డీసీఆర్‌బీ	ఏఎస్ఆర్ జిల్లా
పీవీవీఎస్ఎన్ నరసింహరావు	పార్వతీపురం టౌన్	విశాఖ రేంజ్
వి.అప్పలరాజు	పాయకరావుపేట యూపీఎస్	చోడవరం యూపీఎస్
బమ్మిడి శ్రీనివాసరావు	చోడవరం యూపీఎస్	విశాఖ రేంజ్
జి.ప్రేమ్‌కుమార్	విశాఖ రేంజ్	అనకాపల్లి టాస్క్‌ఫోర్స్
ఎం.చంద్రశేఖర్	అనకాపల్లి టాస్క్‌ఫోర్స్	విశాఖ రేంజ్
ఎ.స్వామినాయుడు	విశాఖ రేంజ్	కశింకోట యూపీఎస్
ఎం.వినోద్‌బాబు	కశింకోట యూపీఎస్	విశాఖ రేంజ్
కె.లక్ష్మణమూర్తి	విశాఖ రేంజ్	అనకాల్లి డీఎస్‌బీ-2

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్	బదిలీ అయిన సర్కిల్
కె.అప్పలనాయుడు	అనకాపల్లి డీఎస్‌బీ-2	అనకాపల్లి సీసీఎస్
ఆర్.నీలయ్య	అనకాపల్లి సీసీఎస్	విశాఖ రేంజ్
ఎన్‌వీ ప్రభాకరరావు	విశాఖ రేంజ్	భోగాపురం యూపీఎస్
ఎ.రవికుమార్	భోగాపురం యూపీఎస్	విజయనగరం పీసీఆర్
సీహెచ్ రాజశేఖరరావు	విజయనగరం పీసీఆర్	విశాఖ రేంజ్
కె.అశోక్‌కుమార్	విజయనగరం టాస్క్‌ఫోర్స్ సెల్	రాజాం టౌన్
డి.మోహనరావు	రాజాం టౌన్	కాశీబుగ్గ అర్బన్
ఎన్‌హెచ్‌వీ ఆనంద్	కాశీబుగ్గ అర్బన్	విశాఖ రేంజ్
జి .శంకరరావు	అనకాపల్లి టౌన్	చీపురుపల్లి
ఈ.నరసింహమూర్తి	విజయనగరం డీఎస్‌బీ-2	విజయనగరం మహిళాస్టేషన్
బి.నాగేశ్వరరావు	విజయనగరం మహిళా స్టేషన్	విశాఖ రేంజ్
ఏవీ లీలారావు	విజయనగరం డీటీసీ	విజయనగరండీఎస్‌బీ-2
బి.లలిత	విజయనగరంలో రిజర్వు	విజయనగరం డీటీసీ
పి.సత్యనారాయణ	ఎల్విన్‌పేట	ఆమదాలవలస
దివాకర వాయునందన యాదవ్	ఆమదాలవలస	వీఆర్
బి.హరి	నర్సీపట్నం	ఎల్విన్‌పేట
ఎం.వెంకటనారాయణ	ట్రాన్స్‌కో నుంచి వచ్చిన అధికారి	అనకాపల్లి ట్రాఫిక్
పి.పైడపునాయుడు	అనకాపల్లి ట్రాఫిక్	వీఆర్
బి.ప్రసాదరావు	విశాఖ రేంజ్	కళింగపట్నం మెరైన్
కె.మురళీధర్	పార్వతీపురంమన్యం వీఆర్	పార్వతీపురంమన్యం డీఎస్‌బీ-2
ఆర్‌వీఎస్ఎస్‌సీహెచ్ శేఖరరావు	అనకాపల్లి డీఎస్‌బీ-2	అనకాపల్లి మహిళా స్టేషన్
డి.దీనబంధు	అనకాపల్లి మహిళా స్టేషన్	విశాఖ రేంజ్
సీహెచ్ వెంకటరావు	శ్రీకాకుళం మహిళా స్టేషన్	జి.మాడుగుల
సి.వాసునాయుడు	సాలూరు టౌన్	ఏఎస్ఆర్ జిల్లా ఎన్‌డీపీఎస్‌టాస్క్‌ఫోర్స్
బి.అప్పలనాయుడు	జీకే. వీధి	సాలూరు టౌన్

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

- జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు

చోడవరం, ఆగస్టు 17: గ్రామాల్లో ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకునేలా చూడాలని సిబ్బందికి జిల్లా వ్యవసాయాధికారి బి. మోహనరావు సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో చోడవరం, బుచ్చెయ్యపేట మండలాలకు చెందిన వ్యవసాయశాఖ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. సెప్టెంబరు 15 నాటికి ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. ఈ-క్రాప్ నమోదు పైనే ఆధారపడి రైతులకు పథకాలు, బీమా అమలవుతుందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ-క్రాప్ నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే జిల్లా స్థాయికి ఆ సమాచారం అందజేయాలని ఆదేశించారు. అంతకు ముందు పట్టణ శివారు అన్నవరం, వెంకయ్యగారి పేటల్లో వరిపైరును ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం అగ్రిల్యాబ్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీ రవీంద్రనాథ్, ఏవో పావని, ఏఈవో కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

'బీఐఎస్ హెల్మెట్‌లనే వాడాలి'

అనకాపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ద్విచక్ర వాహనదారులు బీఐఎస్ హెల్మెట్‌లను మాత్రమే వినియోగించాలని జిల్లా రవాణా అధికారి జి.మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఐఎస్ మార్కు కలిగిన హెల్మెట్లు చట్టబద్ధమైనవని, సురక్షితమని పేర్కొన్నారు. బీఐఎస్ మార్కు లేని హెల్మెట్‌లు విక్రయించే దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపేవారిని గుర్తించి వారికి అవగాహన కల్పించడమే కాకుండా జరిమానా విధిస్తామన్నారు. వాహనదారులతో రహదారి భద్రతా నియమావళిపై అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు.

రెండు లారీలు సీజ్

లంకెలపాలెం, ఆగస్టు 17: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీలను శనివారం గనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. పెదముషిడివాడ రెవెన్యూ పరిధిలో కొండపోరంబోకు భూముల్లో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గనుల శాఖ ఆర్ఐ స్వాతి తన సిబ్బందితో కలిసి దాడి చేసి, రెండు లారీలను పట్టుకొని పరవాడ పోలీసులకు అప్పగించారు. లారీల యజమానులపై కేసులు నమోదు చేసినట్టు పరవాడ పోలీసులు తెలిపారు.

భద్రత కల్పించాలంటూ వైద్యుల ఆందోళన

- కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై నిరసనల వెల్లువ

ఎలమంచిలి, ఆగస్టు 17 : వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎలమంచిలిలో సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆందోళన చేపట్టారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రధాన రోడ్డు మీదుగా నినాదాలు చేసుకుంటూ ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి కోల్‌కతాలో వైద్యాధికారిణిపై జరిగిన ఘాతుకాన్ని ఖండించారు. వైద్యాధికారిణి నిహారిక, సీఐటీయూ, ఏపీవీవీపీ, జేఏసీ, ఎస్ఎఫ్ఐ, వీవైఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కశింకోట : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారానికి వ్యతిరేకంగా కశింకోట, తాళ్లపాలెం పీహెచ్‌సీల వైద్యులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వైద్యాధికారులు తిరుపతిరావు, రమేష్, యశోధ తదితరులు మాట్లాడుతూ వైద్య సిబ్బందిపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు. వీరి ఆందోళనను ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, సీఐటీయూ నాయకులు దాకారపు శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు.

పాయకరావుపేట : పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం సంఘటనకు నిరసనగా శనివారం పాయకరావుపేటలోని పీహెచ్‌సీ వైద్యులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ సౌందర్య, మంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ సంకీర్తనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం నుంచి పదకొండు గంటల వరకూ నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నిరసన తెలియజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీషా, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : ఇక్కడి వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శనివారం ఆందోళన చేపట్టారు. వైద్యులు ప్రసాద్, గోదాదేవి, ఝాన్సీ, హనీషా, జయరాజ్‌లు, సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడి నుంచి మెయిన్ రోడ్డుపై మానవహారంగా ఏర్పడ్డారు. వైద్యులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.



ఎలమంచిలిలో ప్రధాన రోడ్డుపై ఆందోళన చేస్తున్న వైద్యులు, విద్యార్థులు

అచ్యుతాపురం : మండల కేంద్రం అచ్యుతాపురం, హరిపాలెం పీహెచ్‌సీల వైద్య సిబ్బంది శనివారం ఆందోళన నిర్వహించారు. అచ్యుతాపురంలో మానవహారంగా ఏర్పడ్డారు. వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కారణంగా కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం, హరిపాలెం వైద్యాధికారులు శ్రావ్య, వసంత కుమార్, సీహెచ్‌వోలు వేణుగోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : రాంబిల్లి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆందోళన చేపట్టారు. డాక్టర్ సిహెచ్.దీపిక, ఇన్‌చార్జి వైద్యాధికారి క్రాంతి కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఇద్దరికి గాయాలు


మృతుడు యల్లయ్య రెడ్డి (ఫైల్ ఫొటో)

పరవాడ, ఆగస్టు 17 : ఆటోను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. కలపాక పంచాయతీ పరిధిలోని స్వయంభూవరం సమీపంలో శుక్రవారం రాత్రి ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ ఎస్. బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పెదగంట్యాడ మండలం మరడిదాసరిపేటకు చెందిన ధర్మాల యల్లయ్యరెడ్డి (16), దాసరి అనిల్‌కుమార్‌తోపాటు పిట్టవానిపాలెం గ్రామానికి చెందిన కర్రి జనార్దనరెడ్డితో కలిసి శుక్రవారం రాత్రి ఆటోలో లైటింగ్ సామగ్రిని పరవాడలో ఓ శుభకార్యం వద్ద దించారు. అనంతరం ఆటోలో స్వగ్రామానికి వెళుతుండగా స్వయంభూవరం దుర్గమాంబ ఆలయ సమీపంలోకి వెళ్లేసరికి ఎదురుగా వస్తున్న లారీ వీరి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవింగ్ చేస్తున్న కర్రి జనార్దన రెడ్డి, పక్కనే కూర్చున్న ధర్మాల యల్లయ్యరెడ్డి, ఆటో వెనుక తొట్టిలో కూర్చున్న దాసరి అనిల్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురిని 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో యల్లయ్యరెడ్డి మృతి చెందారు. మృతుడు ఐటీఐ చదువుతున్నాడు. ఖాళీ సమయాల్లో లైటింగ్ పనులకు వెళ్తుంటాడు. మృతదేహానికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులు కోలుకుంటున్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ మేరకు సీఐ బాలసూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 17 : మండలంలోని మాసాహెబ్‌పేట శివారులో పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. వీరి నుంచి రూ.4,500ల నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

సినీ ఫక్కీలో ఎస్ఎంసీ ఎన్నికలు

- సామిల్లులో మధ్యాహ్నం వరకు తల్లిదండ్రులను బంధించిన వైసీపీ నేతలు
- పోలీసులు, విద్యా శాఖ అధికారులకు కూటమి నాయకులు ఫిర్యాదు
- పోలీసుల హెచ్చరికతో తల్లిదండ్రులను విడిచిపెట్టిన వైసీపీ నాయకులు
- అనంతరం జరిగిన ఎన్నికల్లో కూటమి మద్దతుదారుడు విజయం


టి.సిరసపల్లి పాఠశాలలో ఎన్నికైన కమిటీ సభ్యులు

మునగపాక (తుమ్మపాల), ఆగస్టు 17 : మండలంలోని టి.సిరసపల్లి ఎంపీపీ స్కూల్‌లో సినీ ఫక్కీలో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. శనివారం పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సందర్భంగా వైసీపీ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులను రహస్య ప్రాంతానికి తీసుకువెళ్లి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రలోభ పెట్టడంతోపాటు భయపెట్టే ప్రయత్నం చేశారు. ఈ సమాచారం పోలీసులకు చేరడంతో వారు వెళ్లి తల్లిదండ్రులను తీసుకువచ్చి ఎన్నికలు నిర్వహించారు. టి.సిరసపల్లి ఎంపీపీ స్కూల్‌లో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో సుమారు 70 మంది తల్లిదండ్రులు ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. వీరిలో 50 మంది తల్లిదండ్రులను స్థానిక వైసీపీ నాయకులు గ్రామ శివారులో గల సామిల్లు వద్దకు శనివారం తెల్లవారుజామున తీసుకెళ్లారు. అక్కడకి తీసుకెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులతో కొంతమంది వైసీపీ నాయకులు దురుసుగా ప్రవర్తించారు. కొంతమంది నాయకులు కూటమి బలపరిచిన వ్యక్తికి ఓట్లు వేసి గెలిపిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ విషయం కూటమి నాయకుల దృష్టికి వెళ్లడంతో వారు పోలీసులు, విద్యా శాఖ అధికారులకు సమాచారమందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు వెంటనే సామిల్లులో బంధించిన విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల వద్దకు తీసుకురావాలని వైసీపీ నాయకులను ఫోన్‌లో కోరారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. దీంతో చేసేదేమి లేక వైసీపీ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులను విడిచిపెట్టడంతో వారంతా పాఠశాల వద్దకు చేరుకున్నారు. అయితే ఎన్నికల్లో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందనే ఉద్దేశంతో విద్యాశాఖ అధికారులు పోలీసుల సహకారంతో బ్యాలెట్ ఓటింగ్‌ను నిర్వహించారు. దీంతో బ్యాలెట్ ఓటింగ్‌లో కూటమి బలపరిచిన పొలమరశెట్టి ఆనంద్‌కుమార్‌ను విద్యార్థుల తల్లిదండ్రులంతా చైర్మన్‌గా ఎన్నుకున్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

విశాఖపట్నం, ఆగస్టు 17: వాల్తేరు డివిజన్ పరిధిలోని పూండి, నౌపడ, తిలారు, కోటబొమ్మాళి సెక్షన్లలో భద్రతా నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కె సందీప్ తెలిపారు. వీటిలో పాండిచ్చేరి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (12897) ఈనెల 21న పాండిచ్చేరిలో రెండు గంటల 45 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుందన్నారు. అలాగే, కేఎస్ఆర్ బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) ఈనెల 21, 23వ తేదీల్లో బెంగళూరులో రెండు గంటల 30 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్టు పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504




పాడేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది... వైద్య సేవలందక బిక్కుబిక్కుమంటున్న వార్డులోని రోగులు



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు



ముంచంగిపుట్టులో ఆందోళన చేస్తున్న వైద్యులు, సిబ్బంది

కదంతొక్కిన వైద్యులు

కోల్‌కతాలో హత్యాచారానికి గురైన యువతికి న్యాయం చేయాలని ఆందోళన

పలు మండలాల్లో ర్యాలీలు, ధర్నాలు, మానవహారాలతో నిరసన కార్యక్రమాలు

వైద్యుల రక్షణకు పటిష్ఠ చట్టాలు అమలు చేయాలని నినాదాలు

పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందక రోగుల అవస్థలు

కోల్‌కతాలో హత్యాచారానికి గురైన యువతికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వైద్యులు రోడ్డెక్కారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు పాడేరు జిల్లా కేంద్రంతో పాటు మన్యంలోని పలు మండలాల్లో ర్యాలీలు, ధర్నాలు, మానవహారాలతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రాణాలను కాపాడే వైద్యులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వైద్య విద్యార్థినిపై దారుణానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు వైద్యులకు రక్షణ కల్పించేలా పటిష్టమైన చట్టాలను అమలు చేయాలని నినాదాలు చేశారు.

పాడేరు రూరల్, ఆగస్టు 17: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో వైద్యాధికారులు, సిబ్బంది భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఓపీని నిలిపివేశారు. అత్యవసర వైద్య సేవలు మినహా మిగిలిన రోగులకు ఒక్క రోజు వైద్య సేవలను నిలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టీఎన్.ప్రతాప్, జనరల్ సెక్రటరీ దినేష్ ఆధ్వర్యంలో ముందుగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆస్పత్రి డీఆర్‌వో టి.నరసింగరావుకు వైద్య సిబ్బంది వినతిపత్రం అందించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం నుంచి సినిమాహాలు సెంటర్ మీదుగా అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీని చేపట్టి అక్కడ మానవహారంగా ఏర్పడి డాక్టర్ ముమిత హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ డిపార్టుమెంట్‌లోని అన్ని కేడర్‌లకు చెందిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులు, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు, పాడేరు డివిజన్ 11 మండలాల పరిధిలోని 32 పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వైద్య సిబ్బందిపై దాడుల నివారనకు ప్రత్యేక మైన కఠిన చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని నినందించారు. ఈ కార్యక్రమంలో అంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి డాక్టర్ జ్ఞానేశ్వరి, ఉపాధ్యక్షులు డాక్టర్ వై.హరికృష్ణ, సూర్య, ఈశ్వర్ సందీప్, గిరిజన ప్రాంత వైద్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శెట్టి నాగరాజు, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, సుబ్రమణ్యం, భూలోకమ్మ, పెద్దమ్మ, సీఐటీయూ నాయకులు సుందరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోల్‌కత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై అమానుషంగా అత్యాచారం, హత్యకు నిరసనగా చేపడుతున్న డాక్టర్ల సమ్మెకు సీపీఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తెలిపారు. కాగా వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఓపీని నిలిపివేయడంతో సేవలు అందక రోగులు ఇబ్బందులకు గురయ్యారు. సాధారణ వ్యాదులతో ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఓపీ లేకపోవడం, వైద్య సేవలు అందించకపోవడంతో రోగులు నిరాసతో వెనుదిరిగారు.

చింతపల్లిలో...

చింతపల్లి: వైద్య విద్యార్థిపై అమానుషంగా అత్యాచారం, హత్య చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సీనియర్ గైనికాలజిస్టు డాక్టర్ సుధాశారద డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యను వ్యతిరేకిస్తూ వైద్యులు, వైద్య సిబ్బంది డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు వైద్య విద్యార్థినిపై జరిగిన అమానవీయ ఘటనపై న్యాయం చేయాలని ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. మానవుల ప్రాణాలు కాపాడే వృత్తిలోనున్న వైద్య విద్యార్థిపై మానవ మృగాలు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి సంఘటనలు దేశంలో ఎక్కడా పునరావృతం కాకుడదన్నారు. వైద్య విద్యార్థిపై అత్యాచారం, హత్య చేసిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేసి సత్వరమే శిక్షన పడేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా వైద్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ భద్రత కల్పించాలన్నారు. ర్యాలీ అనంతరం వైద్యులు ఏరియా ఆస్పత్రిలో యధావిధిగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు చంద్రశ్రీ, సాయి కృష్ణ, రమేశ్, అజయ్ బాబు, ఇందిరా ప్రియాంక, భారతి, నర్సింగ్ సూపరింటెండెంట్ మాత పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: పాలక ప్రభుత్వాలు వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని వైద్యులు డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ స్థానిక సీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం ఆందోళన బాట పట్టారు. సీహెచ్‌సీ ఓపీని నిలిపివేశారు. కేవలం అత్యవసర వైద్య సేవలను మాత్రమే అందించారు. సీహెచ్‌సీ ముందు వారు బైఠాయించి ఆందోళనకు దిగారు. అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలని, ఇటువంటి



గూడెంకొత్తవీధిలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న గిరిజనులు

సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నినాదాలు చేశారు. అలాగే స్థానిక నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. వైద్యుల నిరసన కార్యక్రమానికి వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, ముంచంగిపుట్టు ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, సభ్యులు మద్దతు తెలిపారు.

గూడెంకొత్తవీధిలో...

గూడెంకొత్తవీధి: వైద్య విద్యార్థిపై అత్యాచారం, హత్య చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మన్య పుత్ర యువజన సంఘం అధ్యక్షుడు సోమేశ్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని రింతాడ కూడలి వద్ద గిరిజనులతో కలిసి శనివారం సంఘం సభ్యులు కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విద్యార్థిపై జరిగిన అత్యాచారం, హత్యపై ప్రతి ఒకరు ఖండించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య విద్యార్థిని హత్యచార ఘటనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళ డార్టర్లకు భద్రత కల్పించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది లవరాజు, సంజీవరావు, రవింద్ర తదితరులు పాల్గొన్నారు.



బొర్రాగుహలను తిలకిస్తున్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జేకే.మహేశ్వరి

బొర్రా అందాలు అమోఘం..

▸▸ సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జేకే మహేశ్వరి

అనంతగిరి, ఆగస్టు 17: బొర్రా అందాలు అమోఘమని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జేకే.మహేశ్వరి కితాబు ఇచ్చారు. మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలను శనివారం కుటుంబ సమేతంగా ఆయన సందర్శించారు. సహజసిద్ధంగా ఏర్పడిన గుహల అందాల చరిత్రపై స్థానిక గైడ్స్‌ను అడిగి తెలుసుకున్నారు. గుహలు ప్రత్యేకతకు ఫిదా అయ్యారు. మన్యంలోని అనుభూతి కలిగించే అందాలు దాగి ఉన్నాయన్నారు. ఆయన వెంట అల్లూరి జిల్లా జేసీ జె.అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో వి. అభిషేక్, అడిషనల్ ఎస్పీ ధీరజ్, డీఆర్‌వో పద్మావతి, జిల్లా పర్యాటక శాఖ అధికారి దాస్ తదితరులు ఉన్నారు.

చింతపల్లిలో భారీ వర్షం



చింతపల్లిలో హోరున కురుస్తున్న వాన

చింతపల్లి/గూడెంకొత్తవీధి, ఆగస్టు 17: మండలంలో భారీ వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు వాగులను తలపించాయి. కాలువలు, వీధి కాలువలు, వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరింది. వర్షం వల్ల ప్రజలు గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బంది పడ్డారు.

చాపరాయి జలవిహారిలో పర్యాటకుల తాకిడి

డుంబ్రిగుడ, ఆగస్టు 17: మండల కేంద్రంలోని చాపరాయి జలవిహారిలో పర్యాటకులు శనివారం సందడి చేశారు. మైదాన ప్రాంతం నుంచి చాపరాయి జలవిహారిని తిలకించేందుకు అధిక సంఖ్యలో సందర్శించారు. జలవిహారిలో స్నానాల చూస్తూ ఆనందంగా గడిపారు. పచ్చని గార్డెన్‌లో చిన్నారులు ఆటలు ఆడుకున్నారు.

గంజాయికి ప్రత్యామ్నాయం జాఫ్రా

... 5వ పేజీ తరువాయి

అధికారులు ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్నారు. మొక్కలు పంపిణీతోపాటు గోతులు తీసుకుని నాట్లు వేసేందుకు అదనపు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. చింతపల్లి హెచ్ఎన్‌టీసీలోనూ జాఫ్రా నర్సరీలను ఐటీడీఏ అధికారులు అభివృద్ధి చేస్తున్నారు. రైతులకు ఒక్కొక్క మొక్క రూ.10 ధరకు అందజేస్తున్నారు.

జాఫ్రాలో ఔషధగుణాలు

జాఫ్రాలో అత్యధిక ఔషద గుణాలు, పోషక విలువలున్నట్టు నిపుణుల అధ్యయనంలో వెల్లడయ్యింది. జాఫ్రా గింజల రంగుల్లో వ్యాధి నిరోధక శకిని పెంపొందించే కెరోటినాయిడ్లు అధికంగా వున్నాయి. ఆయుర్వేద వైద్యంలో ఈ చెట్టు బెరడును గనేరియా వ్యాధి నివారణకు, వితనాల గుజ్జును బంక విరేచనాలను అరికట్టేందుకు, ఆకులను పాముకాటు విషయం విరుగుడుకు, పచ్చకామెర్ల వ్యాధి నివారణకు ఉపయోగిస్తున్నారు. అలాగే అనోటా ఉపయోగించడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం లేదని వైద్యనిపుణులు ధ్రువీకరించడంతో జాఫ్రా వినియోగం పెరిగింది.

మూడేళ్లు సాగు ప్రోత్సాహాలు



-కె.లక్ష్మీనారాయణమూర్తి, ఏపీవో, చింతపల్లి

జాఫ్రా సాగుపై ఆసక్తి చూపే రైతులకు ఉచితంగా మొక్కలు అందజేస్తున్నాం. మొక్కలు వేసుకునేందుకు, సంరక్షించేందుకు మూడేళ్లపాటు ప్రోత్సాహక నగదు అందజేస్తాం. మొక్కలు కావాల్సిన రైతులు ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

పాడేరు రూరల్, ఆగస్టు 17: మన్యంలోని విద్యాలయాల్లో శనివారం నిర్వహించిన పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా పాడేరు మండలంలోని 161 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలను ఎంఈవో విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వంతాల కోటేశ్వరరావు ఎస్ఎంసీ చైర్మన్‌గా, తురుక్ ఉమాదేవి వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. పాఠశాలలోని మూడు నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించే పిల్లల తల్లిదండ్రులను ప్రతీ తరగతికి ముగ్గురు చొప్పున సభ్యుల ఎంపిక జరిగింది. అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలను నిర్వహించారు. చైర్మన్‌గా కోటేశ్వరరావు నియామకానికి ఎస్.సింహాద్రి ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉమాదేవి ఎన్నిక ఏకగ్రీవంగానే జరిగింది. పాతపాడేరులో పాఠశాల ఉపాధ్యాయులు శంకరరావు పర్యవేక్షణలో ఎస్ఎంసీ కమిటీ ఎంపిక ఏకగ్రీవంగానే జరిగింది. మండలంలోని 161 ప్రభుత్వ పాఠశాలలకుగాను 160 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించగా, ఒక్క పాఠశాలలో మాత్రమే ఓటింగ్ పద్ధతిలో ఎన్నికలు జరిగాయని ఎంఈవో తెలిపారు.



పాడేరు ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికలో ఓటేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కొయ్యూరులో...

కొయ్యూరు: మండలంలోని 150 పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించినట్టు ఎంఈవో రాంబాబు తెలిపారు. మండల వ్యాప్తంగా 153 పాఠశాలలు ఉండగా మూడు పాఠశాలల్లో వివిధ కారణాలతో ఎన్నికలు నిలిపివేసినట్టు చెప్పారు. మిగిలిన 150 పాఠశాలల్లో ఎన్నికలు సజావుగా జరిగాయని వివరించారు. ఇందులో 96 పాఠశాలల్లో ఏకగ్రీవంగా కమిటీలను ఎన్నుకుకోగా, 56 చోట్ల ఎన్నికలు జరిగాయని చెప్పారు. కొయ్యూరు గురుకుల పాఠశాల చైర్మన్‌గా ఎం.వలసయ్యదొర, వైస్ చైర్మన్‌గా దినాకరత్నంతో పాటు 16 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీని ప్రకటించి ప్రతిజ్ఞ చేయించారు.

చింతపల్లిలో...

చింతపల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. వివిధ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మండలంలో తాజంగి, లంబసింగి, చింతపల్లి, చౌడుపల్లి గ్రామ పంచాయతీల పాఠశాలల్లో మాత్రమే వైసీపీ, టీడీపీ మద్ధతుదారులు చైర్మన్ పదవులకు పోటీపడ్డారు. ఈ పోటీల్లో టీడీపీ మద్ధతుదారులు విజయం సాధించారు. ఇతర పాఠశాలల్లో కమిటీలన్నీ ఏకగ్రీవమయ్యాయి.

జి.మాడుగులలో...

జి.మాడుగుల: మండలంలోని స్కూల్ మానిటరింగ్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 204 పాఠశాలలు ఉండగా, ఇందులో 150 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. 54 చోట్ల ఓటింగ్ జరిగినట్టు ఎంఈవో బాబురావు పడాల్ తెలిపారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు కోలాహలంగా జరిగాయి. ప్రభుత్వ పాథమిక, పాథమికోన్నత, ఉన్నత, గిరిజన ఆశ్రమ, కేజీబీవీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీలను ఎన్నుకున్నారు. పాఠశాలల్లో ఎన్నికల సందడి నెలకొంది. కమిటీలుగా ఏర్పడిన యాజమాన్యం పాఠశాలల అభివృద్ధి, పిల్లల విద్యా ప్రగతికి తోడ్పాటునివ్వాలని ఎంఈవో సుందరరావు కోరారు.

పద్మాపురంలో నిధుల దుర్వినియోగంపై డీపీవో విచారణ

అరకులోయ, ఆగస్టు 17: మండలంలోని పద్మాపురం మేజర్ గ్రామ పంచాయతీలో సాధారణ, 15 ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) కొండలరావు శనివారం విచారణ చేపట్టారు. పద్మాపురం పంచాయతీ పరిధిలోని సుమారు రూ.20 లక్షల మేర నిధులు దుర్వినియోగమయ్యాయని, కార్యవర్గానికి, కార్యదర్శికి సంబంధం లేకుండా సర్పంచ్ నిధులు డ్రా చేశారని ఉప సర్పంచ్ భగత్‌రాం, వార్డు సభ్యులు 20 రోజుల క్రితం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో పద్మాపురం పంచాయతీ కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పద్మాపురం, పెదలబుడు పంచాయతీల కార్యదర్శులతో సుమారు మూడు గంటల పాటు మాట్లాడి వివరాలు సేకరించారు. ఫిర్యాదులో నేర్కొన్న అంశాలన్నింటిపైనా విచారణ జరిపి రికార్డులను పరిశీలించారు. విచారణ నివేదికను 15 రోజుల్లో జిల్లా కలెక్టర్‌కు అందజేస్తానని ఈ సందర్భంగా డీపీవో కొండలరావు తెలిపారు. న్యాయబద్ధంగా విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోకపోతే పంచాయతీ కార్యవర్గమంతా రాజీనామాచేసి ఆందోళనను తీవ్రతరం చేస్తామని విచారణ అధికారిగా విచ్చేసిన కొండలరావుకు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు స్పష్టం చేశారు. ఈ విచారణలో సర్పంచ్ సుస్మిత, ఉప సర్పంచ్ భగత్‌రాం, 14 మంది వార్డు సభ్యులగాను 12 మంది సభ్యులు, కార్యదర్శులు రాంబాబు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



పద్మాపురం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపడుతున్న డీపీవో

అనంతరం పెదలబుడు సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారి మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని డీపీవో నిర్వహించారు. సర్పంచ్ దాసుబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మొక్కలు నాటడం ఎంత అవసరమో, వాటి పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని ఈ సందర్భంగా డీపీవో తెలిపారు.

నెలలు నిండని చంటిబిడ్డకు పునర్జన్మ

▸▸ పరామర్శించిన హెన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

కాకినాడ, ఆగస్టు 17: నెలలు నిండకుండానే జన్మించిన రోజుల చంటిబిడ్డకు కాకినాడ జీజీహెచ్ వైద్యులు శస్త్రచికిత్స చేసి పునర్జన్మను అందించారు. ఆ బిడ్డను హెన్(హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్) స్టేట్ ప్రాజెక్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎస్ మూర్తి శనివారం పరామర్శించి మెరుగైన వైద్యసేవలు అందించాలని జీజీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారికి సూచించారు. వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం తీగలమెట్ట గ్రామానికి చెందిన గిరిజన మహిళ బోనంగి జానకి నెలలు నిండకుండానే స్థానిక పీహెచ్‌సీలో ఈనెల 15న మగశిశువుకు జన్మనిచ్చింది. కాగా, శిశువు ఉదర భాగంపై చర్మం ఏర్పడకపోవడంతో పేగులు బయటకు వచ్చి శిశువు ప్రాణాపాయస్థితిలోకి వెళ్లాడు. దీంతో అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు. ఆ సూచన మేరకు కాకినాడ జీజీహెచ్‌కు రాగా అనంతరం జీజీహెచ్‌లో పిడియాట్రిక్ సర్జరీ వైద్య బృందం శిశువుకు ఇలియాస్టమీ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి పునర్జన్మను ప్రసాదించారు. జీజీహెచ్‌లోని గిరిజన నిరీక్షణ కేంద్రంలో ఉన్న తల్లి జానకిని హెన్ స్టేట్ ప్రాజెక్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎస్ మూర్తి పరామర్శించి చంటిబిడ్డకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమెను బాలింతల సంరక్షణ వార్డులో చేర్చేందుకు ఆదేశాలు జారీ చేశారు.



జీజీహెచ్‌లో సర్జరీ అనంతరం చంటిబిడ్డ

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

పాడేరు రూరల్, ఆగస్టు 17: జిల్లా కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పాత్రికేయులు ఘనంగా నిర్వహించారు. యూనియన్ సభ్యులు ఉదయం స్థానిక కేక్‌ను కట్‌చేసి మిత్రులకు, పత్రికాభిమానులకు అందించారు. అనంతరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. సమాజంలో పాత్రికేయుల సంక్షేమంతో పాటు సమాజ సేవకు పునరంకితం అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దుర్గారావు, జోషి, శ్రీను, రాజేష్, మహేష్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం జరిగింది. సీహెచ్‌సీలో రోగులకు ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు పాలు, రొట్టెలను అందించారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు సురేష్, రమణ, మోహన్, భాస్కర్, రాంబాబు, రాజా, భూషన్, సర్పంచ్ కె.త్రినాథ్ పాల్గొన్నారు.

అనంతగిరి: కొత్తూరు కేజీబీవీ పాఠశాలలో ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలకు పెన్నులు, స్వీట్స్ పంచిపెట్టారు. పాత్రికేయులు వెంకటేష్, లక్ష్మణ్, మదీనా, నరసింహమూర్తి, ప్రవీణ్, సుధాకర్, శ్రీనివాస్, రంజిత్, మహేష్, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి సుశీల పాల్గొన్నారు.

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీగా కొండబాబు

పాడేరు రూరల్, ఆగస్టు 17: అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) సెక్రటరీగా వండలం కొండబాబును డీఈవో పి.బ్రహ్మాజీరావు నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డుంబ్రిగుడ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)గా పనిచేస్తున్న కొండబాబుకు శనివారం ఈ బాధ్యతలు అప్పగించారు. ఎస్‌జీఎఫ్ అల్లూరి జిల్లాకు సంబంధించి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో ప్రెసిడెంట్‌గా, కొండబాబు ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించనున్నట్టు డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రావుల జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు శ్యాంసుందర్, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ పి.సూరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ మత్స్యరాస భూపతిరాజు, ఏపీటీఎఫ్ నాయకులు చెండా కేశవరావు పాల్గొన్నారు.

వీరన్నపడాల్‌కు కాంగ్రెస్ నేతల పరామర్శ

చింతపల్లి, ఆగస్టు 17: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి కంకిపాటి వీరన్నపడాల్ త్వరగా కోలుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాగిన వీరన్నపడాల్ అకాక్షించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అతన్ని పార్టీ నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లాడుతూ వీరన్నపడాల్ అల్లూరి సీతారామరాజు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరోగతికి క్రీయాశీలక పాత్ర పోషించారన్నారు. నెల రోజుల క్రితం అస్వస్థతకు గురికావడంతో పార్టీ కార్యక్రమాలకు దూరం కావాల్సి వచ్చిందన్నారు. ఆయన పూర్తిగా కోలుకుని పార్టీ కార్యకర్తలు, నాయకులకు మార్గదర్శకులుగా పనిచేయాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లకే వెంకటరమణ, నాయకులు రీమల రాజేశ్, వి.గోపీనాథ్, కె.మోహన్‌రావు, గెమ్మెల రామచందర్, నాగేశ్వరరావు, సన్యాసిదొర, అన్నదొర, కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే తెలపండి

కొయ్యూరు, ఆగస్టు 17: పాఠశాలలో సమస్యలు ఉంటే తెలపాలని బాలల హక్కుల పరిరక్షణ ఫోరం కన్వీనర్ అచ్యుత్ సూచించారు. రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాల, కేజీబీవీలలో శనివారం జరిగిన ఎస్ఎంసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలు ఎలా చదువుతున్నారు, వారి ఆరోగ్య పరిస్థితులు, పాఠశాల వాతావరణం తదితర విషయాల గురించి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. బాల్య దశలో వివాహాలు చేయడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం వద్దు

జి.మాడుగుల, ఆగస్టు 17: గ్రామాల్లో తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీవో లోహిత్ జయసాగర్ అధికారులకు ఆదేశించారు. శనివారం ఇక్కడి నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో తాగునీటి, విద్యుత్, వైద్యఆరోగ్య శాఖలకు మాత్రమే సమావేశానికి వెసులుబాటు ఉండడంతో ఆయా శాఖల సమస్యలపైనే ప్రస్తావించినట్టు ఎంపీడీవో చెప్పారు. మిగిలిన శాఖల తీరుతెన్నులు, సిబ్బంది విధి నిర్వహణ తదుపరి సమావేశంలో చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కల్యాణి, ఏటీడబ్ల్యూవో తిరుపాల్, ఏపీఈపీడీసీఎల్ ఏఈ రమణ, జీసీసీ మేనేజర్ కొండబాబు, సీడీపీవో సువర్ణమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించరూ...

జి.మాడుగుల, ఆగస్టు 17: మండల కేంద్రంలోనిచిన్న ఉరుములో విద్యుత్ సమస్యల పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి సెగ్గె లక్ష్మణ్ కోరారు. గత కొన్ని రోజులు నుంచి గ్రామంలో విద్యుత్ సదుపాయం లేక చీటట్లో మగ్గుతున్నట్టుఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు ఉన్నట్టు సిబ్బంది తెలపారని, ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సమస్య తీవ్రతరం అవుతున్నదని వాపోయారు. ఈ సమస్య పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమం చేపడతామని లక్ష్మణ్ హెచ్చరించారు. ఆదివారం సమస్య పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ ఏఈ వెంకటరమణకు స్పష్టం చేశారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

జి.మాడుగుల, ఆగస్టు 17: ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని గాంధీనగర్ పంచముఖ ఆంజనేయసాయి రాం స్వామిజీ సూచించారు. చెక్కరాయి గ్రామంలో శనివారం సామాజిక సేవ కార్యక్రమం నిర్వహించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి భక్తి మార్గంలో పయనించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.